

‘ఉద్యాన పంటల సాగుతో ఆదాయం’

డోర్నకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలు సాగుచేసి రైతులు గత కొన్నేళ్లుగా నష్టపోతున్నారని, వాటి స్థానంలో ఉద్యాన పంటలైన ఆయిల్‌పామ్, మల్బరి, కూరగాయల సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న అన్నారు. ముల్కలపల్లిలో ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్, మల్బరి, కూరగాయల సాగుతో ఎకరానికి రూ.లక్షకు పైగా ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సామినేని చిన్నబాబు, వెన్నబోయిన కొండల్‌రావు, పతంగి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నాడు ఎగసి.. నేడు అలసి..



ఉక్కుపాదంతో విప్లవోద్యమం విలవిల

- మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌తో ఉమ్మడి జిల్లాలో కలకలం
- ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా విలసిల్లిన ఓరుగల్లు
- గత కొంతకాలంగా వరుసగా నేలకొరుగుతున్న అగ్రనేతలు
- గాజర్ల, మోడెం, రేణుక సహా అనేక మంది ఎన్‌కౌంటర్
- లొంగిపోయిన ఆశన్న, సాంబయ్య
- ‘సేవ్ కర్రెగుట్టలు’ పేరుతో సరిహద్దు నుంచే ఆపరేషన్ ముమ్మరం
- ఆపరేషన్ కగార్‌తో తుది అంకానికి తుపాకుల పోరు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల ఉనికి సవాల్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం ‘సేవ్ కర్రెగుట్టలు’ పేరుతో నక్సల్స్‌పై మూకుమ్మడి దాడికి దిగింది. దండకారణ్యాన్ని జల్లెడ పడుతోంది. లొంగుబాట్లను ప్రోత్సహిస్తూనే, ఎన్‌కౌంటర్‌లతో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తాజాగా మావోయిస్టుల్లో కీలకనేతగా ఉన్న హిడ్మా ఎన్‌కౌంటర్ సంచలనం సృష్టించింది. ఇప్పటికే మావోయిస్టుల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన ఓరుగల్లుకు చెందిన అనేక మంది అజ్ఞాత నేతలు ఎన్‌కౌంటర్‌లో హతం అవుతున్నారు. మరికొందరు లొంగుబాటను ఎంచుకుంటున్నారు. అయితే ములుగు ఏజెన్సీకి చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు మరికొందరు అజ్ఞాతంలో ఎక్కడ ఉన్నారు.. ఎలా ఉన్నారనే ఉత్కంఠ నెలకొంది.

ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు నేతలే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అనేక మంది మావోయిస్టు నేతలు ఈ ఏడాది హతమయ్యారు. వీరిలో కీలకమైన కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ సెప్టెంబరు 11న చత్తీస్‌గఢ్‌లో గరియాబాద్ అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన బాలకృష్ణ యుక్తవయస్సులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. అలాగే మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేష్ సైతం ఏపీలో రంపచోడవరం ఏజెన్సీలోని మారేడుమిల్లి అడవుల్లో జూన్ 18 జరిగిన ఎన్‌కౌంటర్‌లో

(మిగతా 7వ పేజీలో)

ముగిసిన హిడ్మా పోరుబాట

మావోయిస్టు కీలక నేత హిడ్మాకు కర్రెగుట్టలే షెల్టర్ జోన్‌గా ఉన్నాయని భావించిన కేంద్ర బలగాలు గత ఏప్రిల్ నెలలో సేవ్ కర్రెగుట్టల పేరుతో 25వేల మందితో భారీ కూంబింగ్ చేపట్టారు. వైమానిక దళం డ్రోన్లు, ఎంఐ 17 హెలికాప్టర్లతో జల్లెడ పట్టారు. కర్రెగుట్టలను దిగ్బంధించటంతో మావోయిస్టులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అయితే కర్రెగుట్టల్లో తప్పించుకున్న హిడ్మా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మారేడుమిల్లి అడవుల్లో హతం కావటం మావోయిస్టు ఉద్యమానికి భారీ దెబ్బగా భావిస్తున్నారు. 26కు పైగా మెరుపు దాడుల్లో కీలకంగా ఉండి అనేక మంది పోలీసుల మృతికి కారణమైన హిడ్మా కేంద్ర బలగాలకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు.



ముడుపుగల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

రైతులకు ఇబ్బందులు కలుగనివ్వొద్దు

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులకు ఇబ్బందులు కలుగనివ్వొవద్దని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మంగళవారం పర్యటించారు. మహబూబాబాద్ మండలం ముడుపుగల్, అయోధ్య, అమనగల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు. టెంట్లు మొదలగు సదుపాయాలు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన రైతులవివరాలను ‘ఆన్‌లైన్’లో నమోదు చేసి త్వరితగతిన డబ్బులు వచ్చే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, టార్పాలిన్లు, మ్యాచ్చర్ మిషన్, ప్యాడీక్లీనర్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్యేకాధికారులు అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఏవో తిరుపతిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

డోర్నకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం డోర్నకల్‌లోని అశోక్‌భవన్‌లో జరిగిన సీపీఐ మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రచార బస్సుజాతా ఈ నెల 21న డోర్నకల్‌కు చేరుకుంటుందని చెప్పారు. ఈ బస్సుజాతలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరు నాగేశ్వర్‌రావు, డోర్నకల్ మండల కార్యదర్శి తురక రమేష్, టౌన్ కార్యదర్శి జన్నె స్వామి, నాయకులు ప్రబేష్, మల్లికార్జున్, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

ఆర్డీవో కార్యాలయం జప్తు

- నష్టపరిహారం అందించడంలో ఆర్డీవో నిర్లక్ష్యం
- కోర్టు ఆదేశాల మేరకు ఫర్నిచర్ తరలింపు

7



ఆర్డీవో ఆఫీసు నుంచి బీరువాను తీసుకెళ్తున్న కోర్టు సిబ్బంది



హుండీలలోని కానుకలను లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

‘ముసలమ్మ’ ఆదాయం రూ.3.46 లక్షలు

కొత్తగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుంజేడులోని ముసలమ్మ దేవత ఆదాయం హుండీల లెక్కింపు జరిగింది. మంగళవారం దేవాలయంలో దేవాదాయశాఖ అధికారులు హుండీలు లెక్కించారు. రూ.3,46,751 ఆదాయం వచ్చినట్టు ఈవో శేషగిరి తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్, సూపరింటిడెంట్ వెంకట్‌రెడ్డి, పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెంవెంకటేశ్వర్లు, వెంకన్న, కిరణ్, నవీన్, అనంతరావు, బట్టు వెంకన్న పాల్గొన్నారు.



మానుకోటలోని వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి

మానుకోట మార్కెట్‌లో పత్తి ఖరీదు

క్వింటాకు రూ.6,866 గరిష్ట ధర

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : మానుకోట వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. మార్కెట్‌కు మంగళవారం 2,151 సంచుల పత్తి అమ్మకానికి వచ్చింది. కాగా, రాష్ట్ర కాటన్ కార్పొరేషన్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈనెల 17న ఒక్కరోజు మాత్రం మానుకోట మార్కెట్‌లో ఖరీదు బంద్ చేశారు. మంగళవారం నుంచి మానుకోటలో ఖరీదులు యథావిధిగా పునఃప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో 753 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.6,866, కనిష్ట ధర రూ. 3300 పలికింది. పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8110 ప్రకటించింది. దీంతో సరుకు తెచ్చిన రైతులు నష్టపోయారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి వద్దిరాజు సృజన్‌బాబు మాట్లాడుతూ పత్తిని ఆరబెట్టి రైతులు శుభ్రంగా తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

మహబూబాబాద్ అగ్రికల్చర్ : జిల్లాలోని కేసముద్రం, మానుకోట, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ పరిధిల్లోని ఆరు జిన్నింగ్ మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 19నుంచి పత్తి కొనుగోళ్లు జరుగుతాయని మానుకోట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వద్దిరాజు సృజన్‌బాబు, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ తెలిపారు. ఈ నెల 17 నుంచి జిన్నింగ్ మిల్లులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటితో ముగిసింది. దీంతో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభవుతున్నాయని తెలిపారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వం మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు.

రైతుల కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి

- రేవంత్ ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోయింది
- యూరియా, బోనస్ ఇవ్వలేదు, రుణమాఫీ పూర్తి చేయలేదు
- లంబాడాలకు ఒక్క మంత్రి పదవి లేదు
- బీఆర్ఎస్ ప్రశ్నిస్తుండడంతోనే ప్రభుత్వంలో చలనం
- ఇద్దరు డాక్టర్లున్నా ఆస్పత్రులను నిర్మించడం లేదు
- కేసముద్రం మార్కెట్లో మాజీమంత్రి హరీశ్‌రావు



కేసముద్రం మార్కెట్లో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

కేసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఏ రైతు కళ్లలో చూసినా నీళ్లు తిరుగుతున్నాయని, యాసంగి ధాన్యం బోనస్, యూరియా ఇవ్వలేదని, రుణమాఫీని కాంగ్రెస్ సర్కారు పూర్తి చేయలేదని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోయిందని పేర్కొన్నారు. కేసముద్రం మార్కెట్లో మంగళవారం రైతులతో ఆయన మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ యాసంగిలో విక్రయించిన వడ్లకు రూ.1100 కోట్ల బోనస్ ఇంకా ఇవ్వలేదని, యూరియా అందకపోవడంతో రైతులు ఈ ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. రెండేళ్లలో రెండుసార్లే రైతుబంధు వచ్చిందని, రుణమాఫీ సగమే చేశారని, మొక్కజొన్న విక్రయించిన రైతులకు ఒక్క రూపాయి కూడా నేటికీ ఇవ్వలేదని వివరించారు. ప్రభుత్వంపై నమ్మకం లేక ప్రైవేటు వ్యాపారులకు, దళారులకు తక్కువ ధరకే ధాన్యం విక్రయించుకుంటున్నామని స్వయంగా రైతులే చెబుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రశ్నిస్తుండడంతో ప్రభుత్వంలో చలనం వస్తోందని, తాము మార్కెట్ల సందర్శన పెట్టడంతోనే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హడావుడిగాపత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. జూబ్లీహిల్స్‌ఎన్నికల్లో పైసలు పంచుడు, కుట్రలు పన్నడంపైనే దృష్టి ఉందని, రైతులకు ఇచ్చిన ఒక్కహామీ అమలు చేయలేదని అన్నారు. లంబాడలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌లో పంటల బీమాను అమలు చేస్తామని హామీ ఇచ్చి విఫలమయ్యారని ఆరోపించారు. డిప్యూటీ స్పీకర్ పదవిని గిరిజనులకు ఇవ్వడానికి, రాష్ట్ర సమస్యలను చర్చించడానికి అసెంబ్లీ పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధైర్యం లేదని అన్నారు.

సీఎంకు మూటలు మోయడమే తెలుసు

- రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో పర్యటన

8

ఇద్దరు డాక్టర్లున్నా ఆస్పత్రులను నిర్మించడంలేదు..

మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు డాక్టర్లు శాసనసభ్యులుగా ఉన్నప్పటికీ తమ హయాంలో మంజూరు చేసిన మరిపెడ, తొర్రూరు, (మిగతా 8వ పేజీలో)



వీరభద్రస్వామి మూలవిగ్రహాన్ని లక్ష బిల్వార్చనతో అలంకరించిన అర్చకులు

వీరభద్రుని ఆలయంలో లక్షబిల్వార్చన

కురవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వీరభద్రస్వామి ఆలయంలో మాసశివరాత్రి పురస్కరించుకుని మంగళవారం భక్తిశ్రద్ధలతో లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు బాలకృష్ణ, రెడ్యాల శ్రీనివాస్, అనిల్, విజయ్ గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, ఏకాదశరుద్రాభిషేకం, చండీహోమం నిర్వహించి, స్వామివారికి లక్షమారేడు పత్రాలతో పూజ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ఈ పూజాకార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈవో సత్యనారాయణ, చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, దొంగల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

చలి తట్టుకోలేక వృద్ధుడు మృతి



వెంకటయ్య (ఫైల్)

కొత్తగూడ, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. చలి మనుషుల ఊసురు తీస్తోంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో మంగళవారం చలి తీవ్రతతో జిమ్మిడి వెంకటయ్య (70) వృద్ధుడు మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా శీతలగాలు వీస్తుండటం, చలి తీవ్రత తట్టుకోలేక మృతి చెందినట్టు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గజ.. గజ

- శీతాకాలం ఆరంభంలోనే వణికిస్తున్న చలి
- సాయంత్రం 4 గంటల నుంచి.. ఉదయం 9 వరకు చల్లని గాలులు
- పట్టణాల్లో స్వెట్టర్ల కొనుగోళ్లు.. పల్లెల్లో చలి మంటలు
- ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చలి తీవ్రత పెరిగింది.. సీతాకాలం ఆదిలోనే శీతలగాలులు భయపెడుతున్నాయి. దీంతో వృద్ధులు, పిల్లలు వణుకుతున్నారు. ఆరంభంలోనే ఇంత చలి ఉంటే.. ఇక ముందు డిసెంబరు, జనవరి మాసాల్లో పరిస్థితి ఏంటని ప్రజలు భయపడుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతోండడంతో పలు ప్రాంతాల్లో చలి రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో జిల్లాకు వాతావరణ కేంద్రం అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మహబూబాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా చలి వణికిస్తోంది. ఉదయం 9 గంటల వరకుచూద్దామన్నా ఎండ కూడా కన్పించడం లేదు.. సాయంత్రం4 గంటల నుంచేచలి ఆరంభమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు బయటకు వెళ్లాలంటే చలికి జనం వణికిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులైతే ఇక పొద్దంతా స్వెటర్లు ధరించాల్సిన పరిస్థితి నెలకొంది.



కేసముద్రంలో చలి కాగుతున్న ప్రజలు (ఫైల్)



మానుకోటలో స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రజలు సైతం ఉద యం, సాయంత్రం వేళ ల్లో బయటకు రావాల్సి వస్తే స్వెటర్లు ధరించి వస్తున్నారు. ఇక పల్లెల్లో ఉదయం వేళల్లో చలి మంటలు కాగుతున్నారు. ఇళ్లలో మొన్నటి దాకా ఎండలు మండి పోవడంతో అటు ఫ్యాన్లు, ఇటు ఏసీలు నిరంతరాయంగా పని చేశాయి. ఇకవారం రోజులుగా చలి తీవ్రత ఉండడంతో ఇళ్లలో కనీ సం ఫ్యాన్లు కూడా వేయడం లేదు. ఇక ఏసీల మాట తెరవడం లేదు. గత రెండు, మూడు రోజులు చలి తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తానికి ఈ సంవత్సరం శీతకాల ప్రారంభంలోనే (మిగతా 8వ పేజీలో)

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

మానుకోట జిల్లాలో వారం రోజులుగా పరిశీలిస్తే.. ఈ విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజు రోజుకూ క్రమంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఈనెల 13న కనిష్ఠ ఉష్ణోగ్రత 14.7 డిగ్రీలు, గరిష్ఠంగా 31.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 14న కనిష్ఠ 22.1 గరిష్ఠ 31.9, ఈ నెల 15న కనిష్ఠ 21.6, గరిష్ఠ 32.3, ఈ నెల 16న కనిష్ఠ 21.1, గరిష్ఠ 30.4, ఈ నెల 17న కనిష్ఠ 12.2, గరిష్ఠ 29.6, తాజాగా మంగళవారం కనిష్ఠ 12.7, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.7 డిగ్రీలు నమోదయ్యాయి.

మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

పెద్దవంగర, నవంబరు (ఆంధ్రజ్యోతి) 18: మండలంలోని అన్ని గ్రామాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఎస్సై ప్రమోద్ కుమర్‌గౌడ్, హెచ్ఎంలు విజయ్ కుమార్, కళాధార్‌తో పాటు పలువురు హెచ్ఎంలు గ్రామాలలో అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాటశాలల ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామా పనులు వేగవంతం చేయాలి

- తొర్రూరు ఆర్డీవో గణేష్

పెద్దవంగర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన, గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా తీసుకున్న దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి రికార్డులను తయారుచేయాలని తొర్రూరు ఆర్డీవో టీ గణేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సాదాబైనామా దరఖాస్తులను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదాబైనామా, రికార్డులను వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూభారతితో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని, ఈచట్టాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. భూహక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా తీసుకున్న దరఖా స్తులను భూభారతి ద్వారా రైతుల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కారం చేసుకోవచ్చన్నారు. భూ సంబంధిత సమస్యలు ఆలస్యం కాకుండా పనిచేయాలన్నారు. తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఆర్ఐ లష్కర్, జేపీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం సాదాబైనామా రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో గణేష్

ఎన్నికల హామీలను అమలు చేయాలి

మరిపెడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడబంగ్లాలో ఆ సంఘం సమావేశం పవన్‌కుమార్ అధ్యక్షతన జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల డిమాండ్లను సత్వరం పరిష్కరించాలన్నారు. సంఘ బాధ్యులు హఫీజర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇండ్లు పంపిణీ చేయాలి

తొర్రూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇండ్లు పంపిణీ చేయాలని జాతీయ మాలమహానాడు కార్యదర్శి ఎ. భాస్కర్ అన్నారు. మంగళవారం తొర్రూరులో గత 5రోజులుగా నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రీలే దీక్షలకు మాల మహానాడు ఆధ్వ ర్యంలో మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిమల్ల మహేష్, సమ్మయ్య, ఎ. రాకేష్, అశోక్, యాకూబ్ ఉన్నారు.

గీతకార్మికులకు ట్యాడీ టాకింగ్ టెస్టింగ్

పెద్దవంగర, నవంబర్ (ఆంధ్రజ్యోతి) 18: మండలంలోని గంట్లకుంట గ్రామంలో గీత కార్మికులకు ట్యాడీ టాకింగ్ టెస్టింగ్ తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై ఎస్.శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్క గీత కార్మికుడికి గుర్తింపు కార్డులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గౌడసంఘ సొసైటీ అధ్యక్షుడు బండి లక్ష్మయ్య, ఎరుకలి సమ్మయ్యగౌడ్, రమేష్‌గౌడ్, గుర్రం శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్య గౌడ్, యాకయ్య, రాములు, యాకయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఆకేరు వాగులో ఇసుక లభ్యతపై పరిశీలన

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం ఆకేరు వాగు పరివాహకంలో ఇసుక లభ్యతపై జిల్లా మైనింగ్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల బృందం మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ జియోలజిస్టు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రమేష్‌బాబు, అసిస్టెంట్ గ్రౌండ్ వాటర్ అధికారి వంశీ, ఇరిగేషన్ ఏఈతో పాటు పలువురు అధికారల బృందం ఆకేరు వాగులో ఇసుకల లభ్యతపై క్షత్రస్థాయిలో పర్యవేక్షించినట్లు తెలిపారు. నివేదికను అధికారులకు అందజేస్తామన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు సన్మానం


హరీశ్‌రావును సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు

మరిపెడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు బీచ్‌రాజ్‌పల్లిలోని ఆయన ఇంట్లో మంగళవారం సన్మానించారు. హరీశ్‌రావు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు వ్యవసాయ మార్కెట్లను సందర్శించి తిరుగు ప్రయాణంలో మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లిలో నవీన్‌రావు ఏర్పాటు చేసిన లంచ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్‌రావు హరీశ్‌రావును సన్మానించారు. లంచ్ అనంతరం హరీశ్‌రావు మరిపెడబంగ్లా మీదుగా హైదరాబాద్‌కు వెళ్లారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతి, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేతలు అచ్యుత్ రావు, తాళ్లపెల్లి శ్రీనివాస్, రఘు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జడ్పీ సీఈవో పురుషోత్తం ● మరిపెడ మండల్ పరిషత్‌లో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

మరిపెడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు సత్వరం పూర్తి అయ్యేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ జడ్పీ సీఈవో పురుషోత్తం అధికారులను ఆదేశించారు. మంగళవారం మరిపెడ మండల్ పరిషత్ ఆఫీస్‌లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ ఈజీఎస్, ఐకేపీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. మరిపెడ మండల వ్యాప్తంగా ఇంకా 104 ఇళ్ల నిర్మాణ పనులు మొదలవ్వలేదని అధికారులకు గుర్తు చేశారు. ఈ ఇళ్ల నిర్మాణ పనులు మొదలయ్యేలా అధికారులు లబ్ధిదారులకు సర్దిచెప్పి వాటి నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో సోమ్లానాయక్, హౌసింగ్ ఏఈ ఉషాకీర్తి, ఏపీఎం అలివేలు, మంగమ్మ, ఏపీవో భీమానాయక్, ఈసీ నెహ్రూ, వివిధ జీపీల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో పురుషోత్తం

కమ్యూనిస్టులతోనే సమస్యలు పరిష్కారం

మరిపెడ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్ అన్నారు.మంగళవారం మండలంలోనే గుండెపుడిలో బయ్యు వెంకన్న భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను విడనాడకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. పాలక పార్టీలు ఎన్నికల వరకే ప్రజలను వాడుకొని ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నార న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో గుండెపుడి ప్రధాన కార్యదర్శి బోడపట్ల రాజశేఖర్, షేక్ షరీప్, కందాల రమేష్, అల్లి శ్రీనివాసరెడ్డి, యామిని నారాయణ, వడ్లకొండ ఉప్పలయ్య పాల్గొన్నారు.

జయ్యారం హైస్కూల్‌లో మాక్ పార్లమెంట్

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండలం జయ్యారం హై స్కూల్‌లో విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రభుత్వాల పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఆ స్కూల్ నిర్వాహకులు మంగళవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి వర్గ బాధ్యులుగా వ్యవహరించారు. మరికొందరు విద్యార్థులు ప్రతిపక్ష పార్టీ నేతలు, సభ్యులుగా వ్యవహరించి అచ్చం పార్లమెంట్ మాదిరిగానే ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు వేసి ప్రభుత్వం ద్వారా సమాధానాలు చెప్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆ స్కూల్ హెచ్ఎం ఉషశ్రీ, సోషల్ సబ్జెక్ట్ టీచర్ స్వామినాథ్ పర్యవేక్షించారు. అనంతరం ప్రతిభ చాటినా విద్యార్థులను అభినందించారు. స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

పైసలిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తాం..

- ● ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు
- ● సిద్ధార్థ ఐటీఐ ఇనిస్టిట్యూట్‌లో ఘర్షణ

మరిపెడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పైసలిస్తనే సర్టిఫికెట్లు ఇస్తామని మరిపెడలో మండల కేంద్రంలోని సిద్ధార్థ ఐటీఐ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి ఖరాఖండిగా చెప్పడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆయనతో మంగళవారం వాగ్వివాదానికి దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెం దిన గండి అజయ్‌కుమార్ ఐటీఐ చేసి పై చదువుల కోసం టీసీ, మెమో ఇతరాత్ర సర్టిఫికెట్లు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తలేదని మొత్తం ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో అజయ్‌కుమార్ తల్లిదండ్రులతో పాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని వాగ్వాదానికి దిగారు. ఐటీఐ కోర్సులో చేరేటప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పోగా మిగతా డబ్బులు రూ.13వేలు ముందే చెల్లించామని ఇప్పుడు ప్రభుత్వం ఫీజు ఇస్తేలేదని చెప్పడం సరైన విధానంకాదని ప్రిన్సిపాల్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల యజమాన్యం, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పరమేశ్, మహేశ్, అంబరీశ తదితరులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయంపై సదరు ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత రాలేదు. దీంతో విద్యార్థి నుం చే ఫీజు వసూలు చేస్తున్నాం.. కళాశాల అధ్యాపకులకు వేతనాలు, కళాశాల మేయింటనెన్స్ భారం తమపై పడుతోందని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో సర్కారు వైఫల్యం


ఐకేపీ సెంటర్ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

కొడకండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. రంగాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ 85లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రగల్బాలు పలికిన సర్కారు, కేవలం ఆరు లక్షల టన్నులే కొనుగోలు చేసిందని ఆరోపించారు. అలాగే, రైతులకు ఇవ్వాల్సిన రూ.1200 కోట్లు ఎంపీఎస్ బకాయిలు, గత యాసంగి రూ.200 కోట్లు బోనస్ ఇంకా విడుదల కాలేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో వడ్లు తిరస్కరణ, తూ కాల్లో అవకతవకలు, బిల్లుల జాప్యం వంటి సమస్యలను రైతులు వివరించగా, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం రంగాపురం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమారపు ఐలయ్య భార్య విమల మరణ వార్త తెలిసిన ఎర్రబెల్లి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు.

కోదండరామస్వామి ఆలయాభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నవాబుపేటలోని ప్రాచీన కోదండరామస్వామి దేవాలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.1.03కోట్లతో ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరాం, డీపీవో నవీన్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శివశంకర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

రేగొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ రమేష్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో వ్యవసాయ అధికారులు, ఏకేపీ సిబ్బంది, కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో ఆయన మంగళవారం సమావేశం న్విహించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ తూకం, టార్పాలీన్, తాగునీరు తప్పనిసరిగా ఉండాలన్నారు. వరి కోత సమయంలో బ్లోయర్ ఆన్ ఉంచి ఆర్‌పీఎం 19ఉండేలా చూడాలన్నారు. వరి కోత మెషిన్ యజమానులు, రైతులు ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలని కోరారు. ధాన్యం తేమ 17లోపు ఉండేలా చూడాలన్నారు. గ్రేడ్-ఏ వరి రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, కామన్ రకం క్వింటాల్‌కు రూ 2,369, సన్నధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్ అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సారయ్య, ఎస్‌హెచ్‌వో దివ్య, సీఈవో జగన్, ఏపీఎం ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

ఇంకా 'ప్రత్యేక'మే..!

- ● ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ వలయంలో మంగపేట మండలం
- ● 15 ఏళ్లుగా జరగని పంచాయతీ ఎన్నికలు
- ● స్పెషల్ ఆఫీసర్లతోనే పరిపాలన
- ● ఈసారి కూడా ఎలక్షన్లు లేనట్టే



మంగపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం

మంగపేట నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలం విచిత్ర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ వివాదం నడుమ నలుగుతోంది. దీంతో పంచాయతీ ఎన్నికలు జరగ్గా ఇక్కడ అభివృద్ధి ఆమడదూరంలోనే ఉంటోంది.

మండలంలో 2014లో జనరల్ విధానంతో ఎంపిటీసీ స్థానాలకు మాత్రమే ఇక్కడ ఎన్నికలు జరిగాయి. అయినా గిరిజన, గిరిజనేత వివాదం సద్దుమణగలేదు. ఎంపీటీసీలుగా గెలిచిన వారు ప్రమాణ స్వీకారం కూడా చేయలేకపోయారు.అనంతరం 2019లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మంగపేట గ్రామ పంచాయతీల సర్పంచులను వంద శాతం గిరిజనులకు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై గిరిజనేతరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రోటేన్ పద్ధతిలో తమకు కూడా ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు వినతిప్రతాలు సమర్పించారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీలను వంద శాతం గిరిజనులకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

- పోలింగ్‌కు ముందు స్టే..

ఈ వివాదం న్యాయ స్థానం పరిధిలో ఉండగానే మండలంలోని 25 గ్రామ పంచాయతీలను గిరిజనులకు కేటాయిస్తూ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీలకు సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే అధికారులు అభ్యర్థుల జాబితాను, గుర్తులను కూడా ప్రకటించారు. పోలింగ్ నిర్వహణ కోసం బ్యాలెట్ బాక్సులతో అధికారులు ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. తెల్లారితే పోలింగ్ ఉండగా కోర్టు నుంచి స్టే ఆర్డర్ వచ్చింది. ఎన్నికలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో పంచాయతీ ఎన్నికలే కాకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలూ ఆగిపోయాయి. ఇలా 15 ఏళ్లుగా మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగడం లేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగుతోంది.

ఈసారి కూడా ఎన్నికలు లేనట్లే..

తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను పరిశీలిస్తే మంగపేట మండలంలో పంచాయతీ ఎన్నికలు ఈసారి కూడా లేవని స్పష్టమవుతోంది. జనరల్ విధానంలో జడ్పీటీసీ స్థానానికి మాత్రమే ఎన్నిక జరుగనుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్రామాలకు సర్పంచులు లేక మరో ఐదేళ్ల గ్రామ పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగక తప్పడం లేదు.

ఎన్నికలు నిర్వహించాలి..

ఎల్.పి.ముత్యాలు, సీపీఎం నాయకుడు



మంగపేట మండలంలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగాలి. న్యాయస్థానంలో మగ్గుతున్న గిరిజన, గిరిజనేతర అంశం త్వరగా తేలాలి. లేదంటే గ్రామాల పాలన ప్రత్యేక అధికారుల చేతిలోకే వెళ్తుంది. గ్రామ అవసరాలు తెలియని ప్రత్యేకాధికారుల పాలన కొనసాగితే అభివృద్ధి అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది.

మారుమూల పల్లెలో పుట్టి..

కేంద్ర పోలీసు సర్వీసు ఉద్యోగం సంపాదించిన యువతి


కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన సుప్రియ

ఏటూరునాగారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మారుమూల గ్రామానికి చెందిన ఓ యువతి కేంద్ర పోలీస్ సర్వీసులో ఉద్యోగం సంపాదించుకుంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్న గూడెం గ్రామానికి చెందిన సుప్రియ సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. పది నెలల పాటు కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న ఆమె మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బరువ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందుకుంది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన సుప్రియను, ఆమె శ్రీదేవి అన్నీ తానై కూలి పనిచేస్తూ బిడ్డను పోషించుకుంటూ ఉన్నత చదువులు చదివించింది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో పది తరగతి వరకు చదివిన సుప్రియ హనుమకొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చేసింది. అదే హనుమకొండలోని ఆర్ట్స్అండ్‌సైన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. కేంద్ర ప్రభుత్వ పోలీస్ సర్వీసులో ఉద్యోగం సాధించిన సుప్రియ పట్టుదల, కృషిని గ్రామస్థులు అభినందిస్తున్నారు.

మేడారంలో కొనసాగుతున్న పనులు


క్యూలైన్ షెడ్ పిల్లర్ కోసం తవ్విన గుంత

తాడ్వాయి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అభివృద్ధి పనుల్లో భాగంగా మేడారంలో భక్తుల క్యూలైన్ షెడ్ల నిర్మాణాలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు మంగళవారం పనులను ప్రారంభించారు. సమ్మక్క-సారలమ్మల మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు పనులు ముమ్మరంగా ప్రారంభిస్తున్నారు. జనవరి 15వ తేదీ వరకు భక్తుల సౌకర్యాల పనులు పూర్తి చేయాలని మంత్రుల ఆదేశాలు ఉన్నాయి. ఈ క్రమంలో మేడారంలో పనులు ఊపందుకున్నాయి. దేవస్థానం పరిసరాల్లోని టీటీడీ కల్యాణ మండపం వెనుక దర్శదర్శనం చేసుకునే భక్తులకు క్యూలైన్లు, షెడ్ నిర్మాణాలు రూ. 3కోట్లతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ ధర్మేందర్, సిబ్బంది, కాంట్రాక్టర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 7న ఆదివాసీ తెగల సమ్మేళనం

తాడ్వాయి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జనవరి 7న ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమ్మేళనం జరుగనుందని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు తెలిపారు. మంగళవారం మేడారం ఐటీడీఏ అతిథిగృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. మహా జాతర సందర్భంగా ఈ సమ్మేళనం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఆయన వెంట ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ దబ్బకట్ల సుమన్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ చేలా శమంతక మణి పాల్గొన్నారు.

క్రీడా సాంస్కృతిక ఉత్సవాలతో మానసిక ఉల్లాసం

● ఎంపీ కడియం కావ్య


క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు దోహదం చేస్తాయని ఎంపీ కడియం కావ్య అన్నారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య, ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. డీవైఎస్‌వో చిర్ర రఘు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 400 మంది యువత అన్ని విభాగాల పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఎంవో సామల రమేష్, సైన్స్ అధికారి బర్ల స్వామి, న్యాయనిర్ణేతలు కామిడి సతీష్‌రెడ్డి, సాంబమూర్తి, మురళి, శంకర్, రాజు, చిరంజీవి, ఫిజికల్ డైరెక్టర్లు ఆనంద్, జ్యోతి, రియాజ్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ స్టాల్‌ను పరిశీలించిన ఎంపీ

కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మిల్లెట్ స్టాల్‌ను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పరిశీలించారు. మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాలతో మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగుతున్న తీరును ప్రసంశించారు. మహిళలు తయారుచేస్తున్న ఆరోగ్యకరమైన మిల్లెట్ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

కొత్త దారుల్లో పీఏసీఎస్‌లు



ఐనవోలులో డీసీసీబీ సొంత భవనం కింద షాపింగ్ మార్ట్

- ఆదాయ వృద్ధి కోసం వ్యాపారాల నిర్వహణ
- సత్ఫలితాలతో ఆర్థికంగా బలోపేతం అవుతున్న సంఘాలు
- మల్టీ సర్వీస్ సెంటర్లతో లాభార్జన
- సంఘాల ఆర్థిక బలోపేతంతో డీసీసీబీకి ప్రత్యేక గుర్తింపు

హనుమకొండ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. ముఖ్యంగా ఆర్థికంగా బలపడడానికి వివిధ మార్గాల పయనిస్తూ వృద్ధి సాధిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు ఆర్థికంగా బలపడేందుకు చేపట్టిన ప్రయోగాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. రైతులకు రుణాల కల్పనలో ఎదురుచూపులు చూసే పరిస్థితి లేకుండా స్వయంగా రుణాల అందజేతకు అవసరమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నాయి. కమర్షియల్‌గా పోటీ పడుతూ వ్యాపార రంగాల్లో విస్తరిస్తూ లాభార్జనలు పొందుతున్నాయి.

ఒకప్పుడు చిన్న గదులు, స్వంత భవనాలు లేని పరిస్థితి సంఘాలది. కానీ ఇప్పుడు స్వంత భవనాల కలిగి ఉండడమే కాదు వాటిని వ్యాపారాలకు అనువుగా మార్చుకోవడం, అద్దెలకు ఇచ్చి కూడా నిధులు సమకూర్చుకునే స్థాయికి ఉమ్మడి జిల్లాలోని సంఘాలు ఎదిగాయి. ముఖ్యంగా మల్టీ సర్వీసు సెంటర్లు (ఎంయస్‌సీ) ప్రాజెక్టును వరంగల్‌లో ప్రయోగించడం ఈ మేరకు సంఘాలు కొత్త రూపంతో ఫలితాలు సాధించడంతో వరంగల్ ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 91 సహకార సంఘాలు ఉన్నాయి.

సొంత భవనాల్లో..

రుణాలతో సొంత ఆస్తులు సముపార్జించుకున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు ఆ భవనాల్లో బ్యాంకు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంలో అద్దె భవనాల్లో నిర్వహణ నుంచి ఇప్పుడు సొంతంగా భవనాల నిర్మాణమే కాకుండా వ్యాపార నిర్వహణకు సైతం అదనపు ఆస్తుల నిర్మాణం చేపట్టిన పీఏసీయస్‌లు ఆదాయ వనరుల వృద్ధిలో ముందంజలో ఉండడానికి డీసీసీ బ్యాంక్ సేవలు అభినందనీయంగా ఉన్నాయి. పీఏసీయస్‌లను ఆర్థికంగా బలోపేతం చేసి ఎంఎస్‌సీ స్కీమ్ ఫలితాలను సాధించడంలో రాష్ట్రంలోనే వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ అగ్రస్థానంలో నిలిచింది.

ఆర్థిక వృద్ధి సాధనలో..

ఒకనాడు పీఏసీయస్‌లు ఆర్థికంగా బలంగా ఉండేవి కావు. సంఘాలు పేరుకే పరిమితంగా ఉండేవి. పంట రుణాలు, వ్యవసాయ ఆధారిత రంగాలకు రుణాల కల్పన అంతంత మాత్రంగానే జరిగేవి. ఈ బాధ్యతలకే సంఘాలు పరిమితం అయ్యేవి. ఆధునికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పీఏసీయస్‌లు కూడా కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. కమర్షియల్ బ్యాంకులపై ఆధారపడే పరిస్థితి రైతులకు తప్పింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో రుణాల అవసరతను సేకరించడంతో పాటు నాబార్డు ఆపై టీఎస్‌సీఏబీ ద్వారా రుణాల లక్ష్యాలు, మంజూరు ఆపై పీఏసీఎస్‌లకు రుణాల జారీ వరకు డీసీసీ బ్యాంకు వారధిగా నిలుస్తూ తన సేవలను విస్తరించింది. తద్వారా పీఏసీయస్‌లను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు డీసీసీ బ్యాంకు కూడా స్వీయ ఆర్థిక శక్తిని కూడగట్టుకుంటోంది.

గోదాములు, పెట్రోల్ పంపులు, మార్కెట్లు..

ఎంఎస్‌సీ ద్వారా పొందిన రుణాలతో పీఏసీఎస్‌లు మండలాల్లో పెట్రోల్ పంపులు, గోదాంలు, వ్యవసాయ ఔట్ లెట్లు, ఫంక్షన్ హాల్స్ నగర పరిధిలోని కార్పొరేట్ మాల్స్‌ను తలపించేలా మండలాలు, గ్రామాల్లో సైతం మార్కెట్స్, మాల్స్ నిర్వహణ భవనాలను నిర్మిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రైస్ మిల్లులు, గోదాంలు, పెట్రోల్ పంపులు ఇలా సొంత ఆస్తుల నిర్మాణం మొత్తం 129 చేపట్టగా వీటిలో 90 ఆస్తుల నిర్మాణం పూర్తయి వివిధ మార్గాల్లో ఆ భవనాల్లో ఆదాయాన్ని పీఏసీఎస్‌లు పొందుతున్నాయి. వీటిలో అత్యధికంగా 68 గోడౌన్లు, 27 అగ్రి ఔట్ లెట్స్ ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన వాటిలో కొన్ని అద్దెకు ఇవ్వడంతో పాటు మరికొన్ని వ్యాపారాలను పీఏసీఎస్‌లే సొంతంగా నిర్వహిస్తూ ఆదాయాన్ని పొందుతున్నాయి. ఇలా ఆదాయ వృద్ధిని సాధిస్తూ డీసీసీ బ్యాంకు నుంచి పొందిన రుణాలను తీర్చిన తరువాత మరింత రాబడిని సృష్టించుకుంటున్నాయి. ఫలితంగా ఆర్థికంగా పటిష్ఠత సాధిస్తూ రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు, విద్యా రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇలా కమర్షియల్ బ్యాంకు సేవలతో పోటీ పడుతున్నాయి.

ఒకప్పుడు ధాన్యాన్ని నిలువ చేసే స్థితి లేక ప్రతికూల పరిస్థితుల్లో నష్టపోయిన రైతులకు ధాన్యం నిల్వల కోసం పీఏసీఎస్‌ల ద్వారా నిర్మితమైన గోదాంలు ఉపయుక్తంగా మారాయి. పీఏసీస్‌లు ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నాయి. ఎంఎస్‌సీ స్కీమ్ ద్వారా డీసీసీ బ్యాంకు నుంచి రూ.52 కోట్లు రుణ కల్పన జరుగగా పీఏసీఎస్‌ల నుంచి రూ.45 కోట్ల రికవరి జరగడం సొసైటీ ఆర్థిక పరిపుష్టిగా నిదర్శనంగా మారింది.

ఎంఎస్సీ ద్వారా బలోపేతం

మల్టీ సర్వీసు సెంటర్ స్కీమ్ ద్వారా డీసీసీ బ్యాంకు పీఏసీఎస్‌లకు ఒక్క శాతం వడ్డీకే రుణాలను అందిస్తోంది. ఎంఎస్‌సీ ద్వారా పీఏసీఎస్‌లు తాము పొందిన రుణాలను పంట రుణాలకే పరిమితం చేయకుండా నూతన ఆదాయ వృద్ధి మార్గాలను అన్వేషించి ఆ మేరకు రుణాలను పెట్టుబడి ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నాయి. గతంలో రుణాలు పొందిన పీఏసీఎస్‌లు కేవలం పంట రుణాలు, వ్యవసాయ ఆధారిత రుణాలే అందించేవి. కానీ నూతన ఒరవడిలో డీసీసీ బ్యాంక్ నుంచి పొందన రుణాలతో సొంత ఆస్తులను నిర్మించుకొని తద్వారా ఆదాయాన్ని పొందుతున్నాయి.

ప్రణాళికలు ఫలితాలిస్తున్నాయి..

టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలు ఆర్థిక పటిష్ఠతను సాధిస్తున్నాయి. ఆర్థిక బలోపేతానికి ప్రవేశపెట్టిన ప్రణాళికలు ఫలితాలను సాధిస్తున్నాయి. తెలంగాణలో తొలిసారిగా మల్టీ సర్వీసు సెంటర్లుగా సంఘాలను రూపొంతర పరిచే ప్రాజెక్టును అమలు చేశాం. ఇది ఆర్థికంగా సంఘాలు ఎదగడానికి నిచ్చెనగా మారింది. ఎంఎస్సీ ద్వారా సంఘాలు రుణాల కల్పనతో పాటు వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాయి. పెట్రోలు పంపులు, గోదాంలు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్స్ నిర్మాణం ఇలా ఇంకా అనేక వ్యాపార నిర్వహణ కేంద్రాలుగా సంఘాలు కొత్త మార్గంలో ప్రయాణం ఆరంభించాయి. కమర్షియల్ బ్యాంకులుగానూ సంఘాల సేవలు విస్తరించాయి.

ప్రశ్నించే వారు లేకుంటే ప్రజాస్వామ్యం లేదు

- ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు
- సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే వారు లేకుంటే ప్రజాస్వామ్యమే లేదని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన బస్సుజాతాను మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ప్రారంభించారు. ముల్కనూర్, ఎల్కతుర్తి మండలాల మీదిగా బస్సుజాతా హనుమకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎల్కతుర్తి, ముల్కనూర్ చౌరస్తాల్లో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వలస పాలకుల చేతి నుంచి విముక్తి కలిగించడానికి సీపీఐ పుట్టిందన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేయడానికి ప్రత్యేక్ష ఉద్యమాలు చేపట్టిన ఘనత సీపీఐ పార్టీదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మతం పేరుతో మారణహోమం సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు చేస్తూ ప్రశ్నించే గొంతుకలను నొక్కుతోందన్నారు. మోదీని చంపడానికి కుట్ర చేశారంటూ వరవరరావుపై రాజద్రోహం కేసులు పెట్టారని మండిపడ్డారు. ప్రజల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా వర్కర్లకు జీతాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్లను ఈ నెలాఖరులోగా చెల్లించకుంటే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం పోరాడేది సీపీఐ పార్టీయేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి నాయకులు కరుణాకర్, సదాలక్ష్మి, తోట భిక్షపతి, మద్దె ఎల్లేష్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఓదెలు, రాజుగౌడ్, సంతోష్, శనిగరం రాజ్‌కుమార్, ఆదరి రమేష్, మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత విధానాలతో ఇబ్బందులు

- రైతుల సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- మొగిలిచర్లలో పంటల పరిశీలన



పత్తి చేనులో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, దయాకర్‌రావు తదితరులు

గీసుగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల శివారులో గల పలు పత్తిపంట క్షేత్రాలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శోభ అనే మహిళ రైతు ఎనిమిది ఎకరాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సరిపడా ఎరువులు లభించకపోవడం, కరెంటు సరిగ్గా లేకపోవడం, రైతుబంధు రెండుసార్లు అందలేదని, పత్తిపంటను అమ్ముకోవాలన్న సీసీఐ నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. తుఫాన్‌తో పత్తి వంటి పంటకు నష్టం జరిగి తీవ్రంగా నష్టపో యామని చెప్పారు. వాటిని చెడగొట్టి మొక్కజొన్న పంటలను సాగుచేస్తామంటే కరెంటు సరిగా లేదని ధనలక్ష్మి అనే మహిళ రైతు వాపోయారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ 8, కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లు పొంది కనీసం రైతుల బాధను అర్థం చేసుకోకుండా రెండు పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పంట క్షేత్రాల్లో దిష్టిబొమ్మలకన్నా ఆయా పార్టీ ఎంపీలు అధ్వాన్నంగా మారారని ఆరోపించారు. బీజేపీలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్న రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల గురించి వారు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. సీసీఐ పెట్టిన పిచ్చి నిబంధనలను వెంటనే తొలగించి రైతులను ఆదుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతుల బాధలను విస్మరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, వినయ్‌భాస్కర్, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మెన్ చింతం సదానందం, సుంకరి శివకుమార్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేష్, కార్పొరేటర్ మనోహర్ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం జప్తు

- నష్ట పరిహారం అందించడంలో ఆర్డీవో నిర్లక్ష్యం
- కోర్టు ఆదేశాల మేరకు ఫర్నిచర్ తరలింపు



ఆర్డీవో కార్యాలయంలో ఫర్నిచర్‌ను స్వాధీనం చేసుకుంటున్న కోర్టు సిబ్బంది, రైతులు

తొర్రూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువ నిర్మాణం కోసం రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించినా, అధికారులు స్పందించక పోవడంతో ఆర్డీవో కార్యాలయంలో ఫర్నిచర్‌ను జప్తు చేశారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలానికి చెందిన రైతులు సాదు ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొరిపెల్లి వెంకన్న 2000వ సంవత్సరంలో ఎస్సారెస్పీ కాలువ నిర్మాణం కోసం తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వగా నష్టపరిహారం కొంత చెల్లించింది. మరింత నష్టపరిహారం కావాలని కోరుతూ సదరు రైతులు న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు. 2011లో జిల్లా కోర్టు నష్ట పరిహారం చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కానీ వారు పట్టించుకోలేదు. దీంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి కూడా హైకోర్టును ఆశ్రయించారు. రైతులు ఎగ్జిక్యూటివ్ పిటిషన్ వేయగా హైకోర్టు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ క్రమంలో రైతులు జిల్లా కోర్టును ఆశ్రయించగా, తొర్రూరు ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయాన్ని జప్తు చేసి కంప్యూటర్‌లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కోర్టు సిబ్బంది వచ్చి కార్యాలయంలో ఉన్న బీరువాలు, ఫర్నిచర్ స్వాధీనం చేసుకుని వాహనాల్లో తరలించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని, కోర్టు పరిహారం చెల్లించాలని ఆదేశించినా ప్రభుత్వ నిబంధనల మేరకు గత పరిహారాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు న్యాయం చేస్తే బాగుండేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

నెక్కొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని లావుడ్యావాగ్యానాయక్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రవి-విజయ దంపతుల ఏకైక కుమారుడు, డ్రైవర్ బానోతు నాగరాజు (25) గత ఐదేళ్ల నుంచి ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. జీవితంలో స్థిరపడిన తరువాత వివాహం చేసుకుందామని అమ్మాయి తెలుపగా అందుకు నాగరాజు అంగీకరించలేదు. దీంతో అమ్మాయి నాగరాజుతో పెళ్లికి నిరాకరించడంతో ఈ నెల 16న గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద జనసంచారం లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతున్న నాగరాజు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఏకైక కుమారుడు మృతితో తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, పశు వైద్యాధికారి

కొమ్మును కోసి.. కన్ను పీకి..

- రక్తస్రావంతో పాడి ఆవు మృతి
- క్షుద్ర పూజలు ?
- జనగామ జిల్లా శ్రీపతిపల్లిలో ఘటన

చిలుపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొట్టంలో కట్టేసిన పాడి ఆవును తాళ్లతో బంధించి.. దాని కొమ్మును కోసి.. ఒక కన్నును బలవంతంగా పీకేసి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన అమానవీయ ఘటన మంగళవారం జనగామ జిల్లా చిలుపూర్ మండలం శ్రీపతిపల్లిలో జరిగింది. బాధిత రైతు శివరాత్రి వెంకటేశ్ కథనం ప్రకారం.

వెంకటేశ్‌కు రెండు పాడి ఆవులు, నాలుగు దూడలను సోమవారం సాయంత్రం వరకు తన పొలంలోనే మేపాడు. పాలిచ్చే వాటిని కొట్టంలో కట్టేసి, మిగతావాటిని బయటకట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆవు తీవ్ర రక్తస్రావంతో మృతి చెంది కనిపించింది. దుండగులు ఎడమ వైపు కొమ్ము, కుడి కన్ను కత్తితో తొలగించడాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనేషకుమార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దుండగులు పశువు వెనుక కాళ్లను తాళ్లతో బంధించి బలవంతంగా కత్తులతో దాడిచేసి కొమ్మును, ఓ కంటిని తొలగించడంతో తీవ్రరక్తస్రావమై మృతిచెందినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. అంతేకాదు, కన్ను, కొమ్మును ఎత్తుకెళ్లడమే కాకుండా, కొంత రక్తాన్ని తీసుకుని సమీపంలో ఉన్న ఉప్పలమ్మ గుడిముందు పోయడాన్ని చూస్తే, క్షుద్రపూజల కోసమే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. రూ.లక్ష విలువ గల పాడి పశువు దుర్మరణం చెందడంతో రైతు వెంకటేశ్ లబోదిబోమన్నారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలుపూర్ ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవితశ్రీ చిట్‌ఫండ్ ఎండీ అరెస్ట్

- శ్రీనివాస్‌ను మధ్యప్రదేశ్‌లో పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అవసరాల కోసం పైసా.. పైసా కూడబెట్టుకొని చిట్టీలు వేయగా బాధితులకు అవసరానికి ఇవ్వకుండా మోసం చేసిన భవితశ్రీ చిట్‌ఫండ్ ఎం.డి. తాటిపెల్లి శ్రీనివాస్‌ను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండల ఎలుకుర్తికి చెందిన భీరి లక్ష్మణ ప్రతాప్ భవితశ్రీలో రూ.3లక్షల చిట్టీ వేయగా 2022లో ముగిసింది. అప్పటి నుంచి డబ్బులు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెడుతుండటంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, అప్పటికే తాటిపెల్లి శ్రీనివాస్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఐదు కేసులు నమోదు కాగా పరారీలో ఉన్నాడు. ప్రతాప్ ఫిర్యాదుతో శ్రీనివాస్ మధ్యప్రదేశ్‌లో తలదాచుకున్నట్లు తెలియడంతో అదుపులోకి తీసుకొని శ్రీనివాస్‌పై చిట్‌ఫండ్ యాక్టు కేసుతో పాటు బాధితులను భయభ్రాంతులకు గురిచేయడం, చీటింగ్ కేసులు నమోదు చేసి మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా, ఇటీవలే భవితశ్రీ చిట్‌ఫండ్ చైర్మన్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌పై కేసు నమోదు చేసి హనుమకొండ పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

రైతుల అభివృద్ధే సహకార వ్యవస్థ లక్ష్యం

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



డీసీసీబీ వారోత్సవంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే సహకార వ్యవస్థ లక్ష్యమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 72వ అఖిల భారత సహకార వారోత్సవాల జరుగుతున్న క్రమంలో మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకులో ఉత్సవాన్ని నిర్వహించారు. టెస్కాబ్, డీసీసీ బ్యాంక్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు జీవనోపాధి కల్పించే బహుళ ప్రయోజనార్థక చర్యలను చేపడుతున్నట్లు వెల్లడించారు. పీఏసీఎస్ వ్యవస్థను ఆధునీకరిస్తూ రైతులకు ఉత్తమ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. సహకార వ్యవస్థ రైతులకే పరిమితం కాకుండా వివిధవర్గాల అభివృద్ధికి వారధిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీసీవో సంజీవ్‌రెడ్డి, కో-ఆపరేటివ్ యూనియన్ ఎం.డి. అన్నపూర్ణ, డీసీసీ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

నాడు ఎగసి.. నేడు అలసి..

(5వ పేజీ తరువాయి)

మృతి చెందారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గణేష్ మృతి మావోయిస్టు ఉద్యమానికి తీరని లోటుగా భావిస్తున్నారు. అలాగే జనగామ జిల్లా కడివెండికి చెందిన గుమ్మడవెల్లి రేణుక అలియాస్ సరస్వతి మార్చి 31న బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యురాలిగా, స్పెషల్‌జోన్ కమిటీ మెంబర్‌గా రేణుక ఉన్నారు. అలాగే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్ అలియాస్ సుధాకర్ మార్చి 25న బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు గ్రామానికి చెందిన బుర్రా రాకేష్ అలియాస్ యుగంధర్ మే 22వ తేదీన నారాయణపూర్ జిల్లా అంబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. వీరితో ఇంకా అనే మంది మావోయిస్టులు ఆపరేషన్ కగార్‌తో ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు.

లొంగుబాటలో అగ్రనేతలు

ఆపరేషన్ కగార్‌తో అనేక మంది ఎన్‌కౌంటర్‌లో మృతి చెందుతుండగా, మరికొందరు లొంగుబాటును ఎంచుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది కీలక మావోయిస్టు నేతలు సరెండర్ అవుతున్నారు. వీరిలో మావోయిస్టు అగ్రనేత, అలిపిరిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడుపై దాడికి సూత్రదారిగా ఉన్న తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసులకు లొంగిపోడటం చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వాసుదేవరావు.. అక్టోబరు 18వ తేదీన చత్తీస్‌గడ్‌లోని జగదల్‌పూర్‌లో 208మందితో సహచరులతో కలిసి డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ సమక్షంలో లొంగిపోయారు. అలాగే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన అల్లూరి జిల్లా, ఆంధ్ర ఒరిస్సా బార్డర్ కార్యదర్శిగా కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ సైతం పోలీసులకు లొంగిపోయినట్లుగా ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల కిందటే పోలీసులకు తన సహచరులతో కలిసి సరెండర్ అయ్యారని సమాచారం. అయితే పోలీసులు అధికారికంగా ధ్రువీకరించడం లేదు.

దామోదర్ ఎక్కడో ?

మావోయిస్టు పార్టీలో కీలక నేతలు లొంగుబాటను ఎంచుకోగా, మరికొందరు ఉద్యమంలో ప్రాణాలర్పిస్తున్నారు. అయితే మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన చొక్కారావు 1997లోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. అంచెలంచెలుగా ఎదిగిన దామోదర్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా జనవరి 18 దామోదర్ ఎన్‌కౌంటర్ అయ్యారని ప్రచారం జరిగింది. అయితే వారం రోజులకే దామోదర్ క్షేమంగా ఉన్నారని మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. దీంతో సానుభూతిపరులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రస్తుతం ఆపరేషన్ కగార్ ఉధృతం అవుతుండడంతో పాటు కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లు, లొంగుబాటులో ఉండటంతో దామోదర్ ఎక్కడ..? ఎలా ఉన్నారనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతల్లో ఉన్నది దామోదరే కావటంతో విప్లవకారుల్లో ఉత్కంఠ నెలకొంది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : కలెక్టర్

మహబూబాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులంతా కలిసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు మధుసూదనరాజు, సబిత, శిరీష, దేశీరాం, బి.శ్రీనివాసరావు, శ్రీనివాస్, విజయ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ క్రైం : మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతీ పౌరుడు బాధ్యతగా భావించాలని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి సమక్షంలో పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపైలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానుకోటలో మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు

వివిధ మండలాల్లో..

● మరిపెడ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై వివిధ శాఖల అధికారులు, పాఠశాలల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సీఐ రాజ్‌కుమార్ గౌడ్, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎస్సైలు వీరభద్రరావు, కోటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ విజయానంద్ పాల్గొన్నారు.

● చిన్నగూడూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రతిజ్ఞ చేశారు. ఎస్సై ప్రవీణ్, తహసీల్దార్ సంపత్, ఎంపీడీవో సుజాత పాల్గొన్నారు.

● తొర్రూరులోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాములు పాల్గొన్నారు.

● బయ్యారంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో దీక్షిత, సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి, ఎంఈవో దేవేంద్రాచారితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు.

● గార్లలోని నెహ్రూసెంటర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సీపీఎం మండల కార్యదర్శి అల్వాల సత్యవతి, జిల్లా నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ అంధకారం అవుతుందని, వాటి నివారణకు సమిష్టిగా కృషి చేయాలని కురవి ఎస్సై గంద్రాతి సతీష్ అన్నారు. కురవి గుడి సెంటర్‌లో ప్రజలకు మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ నాయకులు అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఎన్. కృష్ణమూర్తి, దడిగల నర్సయ్య, పోలీస్ సిబ్బంది గాడిపెల్లి అనిత, వెంకటయ్య, వీరన్న, సుధాకర్, ఆటో యూనియన్ బాధ్యులు బోడ లచ్చు, నాగబాబు, సంపత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● నర్సింహులపేటలో..

మాదకద్రవ్యాల నివారణ ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకొని మత్తు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని నర్సింహులపేట ఎస్సై మాలోతు సురేష్ అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు నర్సింహులపేట మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకన్న, రైటర్ చంద్రయ్య, పీసీలు లక్ష్మణ్, మమత, హోంగార్డు నయాంపాష ఉన్నారు.

రైతుల కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి

(5వ పేజీ తరువాయి)

నర్సింహులపేట, పెద్దవంగర ఆస్పత్రులను నిర్మించడంలేదని హరీశ్‌రావు తెలిపారు. బతికి ఉన్న మనిషిని మహబూబాబాద్ మార్చురీలో పెట్టిన ప్రభుత్వం ఇదేనని, ఈ ఘటనపై విచారణ, చర్యలు ఇప్పటి వరకు లేవని ఆరోపించారు. మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలు తాము మంజూరు చేస్తే.. వాటిలో ఇప్పటి వరకు సౌకర్యాలు లేవని అన్నారు. ఎనిమిది చెక్‌డ్యాంలను నిర్మించాల్సి ఉండగా, కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియాగా ఆగిపోతుందని నిర్మించడంలేదని అన్నారు. మల్యాలలో హార్టికల్చర్ డిగ్రీ కళాశాల మంజూరు చేయగా, ఇంత వరకు ఏర్పాటు చేయలేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నేటికీ ఇవ్వలేదని ఈ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నమ్మకం లేక రాష్ట్రంలో 67వేల మంది విద్యార్థులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గారని అన్నారు.

మార్కెట్లో కొనుగోలు కేంద్రమే లేదు..

ఉమ్మడి జిల్లాలో వరంగల్ తర్వాత పెద్దదైన కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నేటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రమే ఏర్పాటు చేయలేదని హరీశ్‌రావు అన్నారు. బోనస్ రాక రైతులు తక్కువ ధరలకు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారని, వారి పేర్లతో సహా తెలిపారు. ఈ మార్కెట్లో సెక్యూరిటీ సరిగ్గా లేక పందులు, మేకలు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని అన్నారు. ఇక్కడ విక్రయించిన మొక్కజొన్న రైతులకు ఒక్క రూపాయి రాలేదని పేర్కొన్నారు. హరీశ్‌రావు వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీమంత్రి సత్యవతిరాథోడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, నీలం దుర్గేష్, రావుల రవిచందర్‌రెడ్డి, నజీర్‌అహ్మద్ ఉన్నారు.

సీఎంకు మూటలు మోయడమే తెలుసు

వరంగల్ వ్యవసాయం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప ఏమీ తెలియదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కలెక్షన్ల మీద రివ్యూ మీటింగులు పెట్టుడు తప్ప రైతుల సమస్యలపై స్పందించడం తెలియదని విమర్శించారు. రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిన నేపథ్యంలో పత్తి రైతులకు మద్దతుగా మంగళవారం ఆయన వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయమార్కెట్‌ను సందర్శించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం మార్కెట్‌లో పర్యటించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కాటన్ వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మక్కల యార్డుకు వెళ్లి రైతులతో మాట్లాడారు. పంట దిగుబడి, పెట్టుబడి, గిట్టుబాటు ధర గురించి ఆరా తీశారు.

అనంతరం హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలవల్ల పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సీసీఐ తీసుకునే తుగ్లక్ నిర్ణయాల వల్ల నానా తంటాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్1, ఎల్2, ఎల్3 విధానాన్ని, కపాస్ యాప్‌ను ఎత్తివేయాలని, ఎకరానికి 12 క్వింటాళ్ల కొనాలని, తేమ శాతం నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు.

సీసీఐ పెట్టిన కొత్త నిబంధనలను సడలించి వెంటనే పత్తి కొనుగోళ్లు చేపట్టకపోతే రైతులతో కలిసి పోరాడుతామని హరీష్‌రావు అన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది ఎంపీలు గెలిచి ఏం చేస్తున్నారని హరీష్‌రావు ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్ అధికారులను అడిగితే ఇప్పటి వరకు మూడు వేల 400 క్వింటాళ్లు మాత్రమే కొన్నట్లు చెప్పారని హరీష్‌రావు తెలిపారు. సంబంధిత రైతులకు ఇప్పటివరకు డబ్బులు జమ చేయలేదన్నారు. నెల నుంచి మక్కలు కొంటున్నరు కదా.. ఇప్పటి వరకు రూపాయి ఇవ్వకపోతే ఎట్లా..? ఈ కారణంగానే రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. పోయిన యాసంగిలో ఇస్తామన్న బోనస్ రూ.1100 కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు.

ఈ సంవత్సరం కొన్న వడ్లకు కూడా రూ.1400 కోట్లు చెల్లించాల్సి ఉందని, వెంటనే బకాయిలన్నింటినీ చెల్లించి రైతులను ఆదుకోవాలని అని హరీష్‌రావు మాండ్ చేశారు.



పంపుహౌస్‌ను తొలగించాలని ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు

‘వాటర్ పంప్‌హౌస్‌ను తొలగించాలి’

మహబూబాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంకరబోడు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్ పంప్‌హౌస్‌ను తొలగించి, రోడ్డును విస్తరించాలని సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోడులో ప్రమాదకరంగా నిరుపయోగం ఉన్న వాటర్ పంప్ హౌస్‌ను తొలగించి సీసీ రోడ్డును విస్తరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. . స్థానికులు పాపారావు, రమేష్,వెంకటేశ్వర్లు, షమీమ్, రవి, హరీష్, ముక్తార్‌పాష, తిలక్, కొమరయ్య, బాబా, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, శ్యాంప్రసాద్, రమేష్, బాలు, ఓంప్రకాశ్, శ్రీకాంత్, పుష్పయ్య, మల్లికార్జున్, చరణ్, రామయ్య పాల్గొన్నారు.

‘మారెడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి’

మహబూబాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారెడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, దానిపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని కోరారు. మారెడు మిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయవిచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

మకరతోరణం బహూకరణ

ఇనుగుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి శ్రీహనుమాన్ దేవాలయానికి మకరతోరణాన్ని మంగళవారం భూక్య శోభన్‌బాబు బహూకరించారు. మకరతోరణాన్ని అలకరించేందుకు అర్చకులు ఫణిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వంచారు. మాజీ ఎంపీటీసీ మాలోత్ మంజుల, చిన్న మంగ్యా, మాలోత్ మంగ్య, మామిడి జనార్దన్, అశోక్, భూక్య లక్‌పతి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీపీఆర్‌వో, కవులు

విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గేయ రచయిత అందెశ్రీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని, విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలని జిల్లా పౌరసంబంధాల శాఖఅధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మానుకోటలోని వికాస్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం అందెశ్రీ సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కవులు, కళాకారులు, రచయితలు కొమిరె వెంకన్న, గుర్రపు సత్యనారాయణ, రాజమౌళి, బండ వెంకన్న, దర్శనం యుగందర్, భరత్, ప్రవీణ్, అశ్విని, ప్రిన్సిపాల్ వీరయ్య, అధ్యాపకులు రవీందర్, యాకన్న, సారంగం, బిక్షపతి, నాగరాజు, రమేష్, మధు, రఘు, సునిత, రాజేశ్వరి, నరేష్ పాల్గొన్నారు.



గురుకులంలో తనిఖీ నిర్వహిస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

పిల్లలకు తగిన ఏర్పాట్లు చేయాలి

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వాతావరణ (సీతాకాలం) నేపథ్యంలో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్ ఇందిరానగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ కళాశాలను మంగళవారం రాత్రి సందర్శించారు. స్టడీ అవర్లలో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలోని డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్, తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన రుచికరమైన వేడి ఆహార పదార్థాలను అందించాలని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తగిన వసతులు కల్పించాలన్నారు. ప్రతీ సబ్జెక్టులో పట్టు సాధించే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాలని హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నెహ్రూసెంటర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెండునెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కురియాల గంగాధర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం ర్యాలీగా వచ్చి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, కుమార్, నాగరాజు, ఫార్మాసిస్టులు, ఆప్టోమెట్రిస్టులు, స్టాఫ్‌నర్సులు వసుమతి, మలిత, షాలిని, అలీ, బాలాజీ, పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మద్దతు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ మద్దతు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 18వేల మంది కార్మికులు ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో ముందు వరుసలో ఉంటున్నారని, కరోనా కష్టకాలంలో కూడా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించినట్లు చెప్పారు. ప్రభుత్వం వారి వేతనాలను ప్రతినెల అందించాలని డిమాండ్ చేశారు.

గజ.. గజ

(5వ పేజీ తరువాయి)

చలి ప్రజలను వణుకు పుట్టిస్తోంది. మున్ముందు దీని తీవ్రత ఎలా ఉంటుందో తలచుకుంటేనే భయమేస్తోంది.

స్వెట్టర్ల దుకాణాల వద్ద రద్దీ..

గత వారం రోజులుగా చలి తీవ్రత పెరిగిపోవడంతో పట్టణ ప్రాంతాల్లో స్వెటర్ల దుకాణాలు భారీగా వెలిశాయి. మానుకోట జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలకేంద్రాల్లో రోడ్డు వెంట ఉన్నిదుస్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చలి తీవ్రతతో స్వెటర్లతో పాటు దుప్పట్లు, చలి టోపిలు, మఫ్లర్లను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది వాటి విక్రయాలు భారీగానే పెరిగాయని చెప్పవచ్చు. మరో పక్క పల్లెల్లో ఉదయాన్నే లేచి వీధుల్లో మంట కాగుతున్నారు. గ్రామాల్లో ఉదయాన్నే లేచి పనులకు వెళ్తుంటారు. చలి తీవ్రత బాగా పెరిగిపోవడంతో చలి నుంచి బయట పడేందుకు వేడి కోసం వీధుల్లో చలి మంటలు కాగుతున్నారు.

ఆరోగ్యం జాగ్రత్త..

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత క్రమంగా పెరుగుతుందని, దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని.. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు పాటించాలని చెబుతన్నారు. చిన్నారులు, వృద్ధుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, ముఖ్యంగా వారి ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గాలిద్వారా సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశంచి తెల్ల రక్తకణాలను నిర్వీర్యం చేయడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏసీలు, ఫ్యాన్లు వాడకూడదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలను తినాలని, కూల్‌డ్రింక్స్ ఇతర తినుబండనాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

వసతి గృహాల తనిఖీలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని ప్రత్యేకాధికారులు మండలాల బాట పట్టారు. వారివారి మండలాల పరిధిలోని వసతి గృహాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించారు. మరిపెడ మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. గంగారంలో గిరిజన ఆశ్రమ పాఠశాల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అమలు, కేజీబీవీ విద్యాలయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ పరిశీలించారు. నెల్లికుదురు మండలంలో వసతి గృహాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి మరియన్న సందర్శించారు.



మరిపెడలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

బయ్యారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా వల్లాల వెంకన్న కో-కన్వీనర్‌గా అంగిరేకుల నాగేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులుగా మోహన్, యాకూబ్, సైదులు, పురుషోత్తం, సోమిరెడ్డి, లతీఫ్, అశోక్, ఆదిశేషులు, చంద్రకళ, శకుంతల, స్వరూప, అన్నపూర్ణ, సరోజ, మల్లికాంబ, యశోద, స్వప్న, వెంకటరెడ్డి, బాలును ఎన్నుకున్నారు. కాగా ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో మరిపెడలో జరుగు సీఐటీయూ జిల్లా 4వ మహాసభలో కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర తల్లిదండ్రుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్

ఉద్యమకారులకు అండగా ఉంటాం

● మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

కురవి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. రాజోలులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోట రవి కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. రవి చిత్రపటానికి నివాళులు అర్పించి భార్య స్వప్న, కుమార్తెలు సిరి, శ్వేతలకు ధైర్యం చెప్పారు. మాజీ మంత్రులు డీఎస్.రెడ్యానాయక్, సత్యవతిరాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, బీఆర్ఎస్ నాయకులు తోట లాలయ్య, బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోతు రవి, జి.రాంచంద్రయ్య, నామ సైదులు, బత్తుల వెంకన్న, యానాల గంగాధర్‌రెడ్డి, రొయ్యల నాగేశ్వర్‌రావు, పెద్ది వెంకన్న పాల్గొన్నారు.

ఘన స్వాగతం

● మహబూబాబాద్ టౌన్ : జిల్లా కేంద్రంలో హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికారు. రాజోలులో తోట రవి కుటుంబాన్ని పరామర్శించి, తిరిగి వెళ్తున్న క్రమంలో మహబూబాబాద్ వివేకానంద సెంటర్‌లో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎమ్డీ ఫరీద్ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు మాజీమంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండి వెంకన్న, దుగ్గి రాంగోపాల్, రఫిక్, విక్రమ్, సాజిద్, నీలేష్‌రాయ్, రమేష్, రవి, రాజు, కార్తీక్, యాదగిరి, జీవన్, మల్లయ్య, వంశీ, అఖిల్, పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో నివాళులు

● ఇనుగుర్తి : ఇనుగుర్తి వద్దిరాజు మెమోరియల్ పార్కులో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కిషన్ తల్లిదండ్రులైన నారాయణ, వెంకటనర్సమ్మ విగ్రహాల వద్ద మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్ నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, ఎనుగు రాకేష్‌రెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి ఉన్నారు.

చలోఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ

ఇనుగుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాల మహానాడు ఆధ్వర్యంలో 26న చేపట్టిన చలోఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ ఇనుగుర్తిలో మంగళవారం కరపత్రాలను సంఘం జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలకు రిజర్వేన్లను 15 నుంచి 20శాతానికి పెంచాలని, వర్గీకరణ రోస్టర్ ఉత్తర్వులు 99, 20లు రాజ్యాంగ వ్యతిరేకమని, వీటిని పునఃసమీక్షించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్, దార్ల రాంమూర్తి, బేతమల్ల చంద్రయ్య, పప్పుల వెంకన్న, నాగెల్లి సుధీర్, భిక్షం, మోటమారి యాకసాయిలు, ఎన్నమల్ల దర్గయ్య పాల్గొన్నారు.



బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డోలి సత్యనారాయణ, పార్నంది రామయ్య

బిర్సాముండా ఆశయ సాధనకు పాటుపడాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జల్.. జంగిల్.. జమీన్ నినాదంతో గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన బిర్సాముండా ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, పార్నంది రామయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆదివాసీ నాయకుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, కృష్ణారావు, శంకర్, అధ్యాపకుడు ముత్తయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 9, 10వ తరగతి విద్యార్థులకు ‘లైబ్రరీస్ ది హార్ట్ ఆఫ్ నాలెడ్జ్’ అనే అంశంపై వ్యాసరచన, 7, 8 వతరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయనిర్ణేత, రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పింగలి శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, గ్రంథ పాలకులు జి.విజేందర్, సీహెచ్.రవి, రుద్రారపు వీరేందర్, భూలక్ష్మి, యాదమ్మ, ఉపాధ్యాయులు జంపాల నారాయణ, శ్రీధర్, ఎం.సత్తార్, సయ్యద్ రషీద్, వినోద్, అజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి శ్రీలత

ఖోఖో పోటీలకు రెడ్యాల విద్యార్థి ఎంపిక

మహబూబాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మహబూబాబాద్ మండలం రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వరుణ్ ఎంపికైనట్లు హెచ్‌ఎం సక్కు, పీడీ మోహన్‌నాయక్ మంగళవారం తెలిపారు. రెడ్యాల ఆశ్రమ పాఠశాల విద్యార్థి వరుణ్ ఈ నెల 18న హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సదరు విద్యార్థి వరుణ్‌ను గిరిజన సంక్షేమ శాఖ డీడీ దేశీరాంనాయక్‌తో పాటు రెడ్యాల ఆశ్రమ బాలుర పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మహాసభలు విజయవంతం చేయాలి

గార్ల, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జనవరి 25 నుంచి 28 వరకు జరపతలపెట్టిన ఐద్వా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి కోరారు. మంగళవారం మండలకేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ఐద్వా మండల కమిటీ సమావేశంలో మహాసభలకు చెందిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గార్ల మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని మహాసభల విశిష్టతను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లెల నాగమణి, కె.సుజాత, ఉమావతి, రమాదేవి, ఈశ్వరమ్మ, పద్మ పాల్గొన్నారు.